క్లుప్తంగా

వైభవంగా చింతామణి సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కవిటి: కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కుబడులు తీర్చుకునే క్రమంలో మంగళవారం సంబరాల్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో బాణసంచాకాలుస్తూ కాళికావేషధారణలతో కవిటి పట్టణవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిగుడిలో ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

మొక్కలు నాటివేత



మొక్కను నాటుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ముత్యాలమ్మ కోనేరు పార్కులో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్‌క్లబ్ సభ్యులు బెల్లాల ప్రమోద్, ధన్విన్‌ల ఆధ్వర్యంలో మొక్కలు సమకూర్చి వాటికి రక్షణ కల్పించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పండిత రాజేంద్ర, కార్యదర్శి దడియాల నరసింహులు, లండ నాగరాజు, పండర బుజ్జి, రాము పాత్రో, సంతోష్ పాత్రో, పరమేశ్వరి మోహన్‌రావు, రామారావు, మోహన్‌రావు, నీలిమ, తేజ, మధు పాల్గొన్నారు.

నేడు ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ప్రారంభం



పథకం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాజెక్టు ద్వారా మంచినీటి సరఫరాను బుధవారం ప్రారంభించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మంగళవారం తెలిపారు. అక్కుపల్లి రోడ్డు కూడలి వద్ద ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే గౌతు శిరీష దీన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ పథకానికి సిందూర జలసిరి అని పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.

రైతు సంఘాల ద్వారా జీడిపిక్కల సేకరణ



మాట్లాడుతున్న ఎంపీఎం కూర్మారావు

మందస: మండలంలో వన్ దన్ వికాస్ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి.. రైతు సంఘాల ద్వారా జీడి పిక్కల సేకరణ పారదర్శకంగా చేపట్టాలని మందస ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మహిళా సంఘాల సభ్యుల ఆదాయ అభివృద్ధి మెరుగు పడాలన్నారు.

సచివాలయం సందర్శన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు పేర్కొన్నారు. మండపల్లి గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలు గూర్చి సమీక్షించారు. అదేవిధంగా గ్రామంలోని చెరువులో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. గ్రామ ప్రాథమిక పాఠశాలలో శ్లాబు పాడవ్వడంతో వర్షానికి లీకవ్వడం జరుగుతుందని చెప్పడంతో ఎంఈఓ ఎస్.శివరాంప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.

విద్యార్థినికి అభినందన



కీర్తనను అభినందిన్న ఉపాధ్యాయులు

మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పైల కీర్తన ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించింది. అలాగే ఇంటర్‌లో చేరేందుకు నిర్వహించిన డాక్టర్ అంబేడ్కర్ గురుకులాల కామన్ ఎంట్రన్స్ టెస్టులో వందకు 82 మార్కులు సాధించింది. దీంతో కీర్తనను పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛాలతో ఉపాధ్యాయులు అభినందించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.భీమారావు, పి.రాంబాబు, ఎం.చిత్రసే పాల్గొన్నారు.

అన్నదాతకు అడంగల్ కష్టాలు!

- పంటరుణాల రెన్యువల్‌కు ఆపసోపాలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం



వజ్రపుకొత్తూరు రూరల్: ఒడ్డు దాటితే తెడ్డు చూపించే సమేతలా ఉంది ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన. అధికారం కోసం ఎన్నికల సమయంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం, వైఎస్సార్ సీపీ ఇచ్చిన సంక్షేమం కంటే మిన్నగా ఫలాలు అందిస్తామని మాయమాటలతో అశలు చూపించారు. తీరా అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమం దేవుడెరుగు..ఖరీఫ్ పంట సమయంలో తీసుకున్న రుణాల రెన్యువల్‌కు మాత్రం అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు. తమ భూమిపై తీసుకున్న పంట రుణాలకు బ్యాంక్‌లలో రెన్యువల్ చేసేందుకు ఇన్ని తిప్పలేంటి బాబూ అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేయాలంటే 1-బీ ఉంటే సరిపోయేది. నేరుగా గ్రామ సచివాలయాలకు వెళ్లి కేవలం రూ. 50 చెల్లించి 1-బీని పొందేవారు. కేవలం 1-బీతో పాటు బ్యాంక్ పాస్ పుస్తకంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రెన్యువల్ చేసుకునేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో అవస్థలు పడుతున్నామని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ రుణాలను రెన్యువల్ చేసుకుందామంటే అడంగల్ కోసం ఆర్థిక ఇబ్బంది పడుతున్నామంటున్నారు. రైతు పేరిట ఎన్ని సర్వే నంబర్లు ఉంటే అన్ని అడంగళ్లు తీయాల్సిన దుస్థితి ఏర్పడిందని..దీంతో ప్రతీ అడంగల్ కాఫీకి రూ. 50 చెల్లిస్తున్నామని చెబుతున్నారు. అలాగే 1-బీ, అడంగల్ కోసం గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాలు, బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

పడరాని పాట్లు..

రైతుల పేరుతో భూ హక్కు పత్రాలలో ఉన్న సర్వే నంబర్లు నేడు మాయం అవుతున్నాయని.. గతంలో వచ్చిన సర్వే నంబర్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. పాసు పుస్తకంలో ఉన్న పట్టా నంబర్‌తో 1-బీ వస్తుంది. అయితే 1-బీలో వచ్చిన సర్వే నంబర్లతో అడంగల్ మాత్రం రావడం లేదు. దీంతో మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ మండుటెండలో తిరుగుతు న్నామని అన్నదాతలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట రుణాలను రెన్యువల్ చేసేందుకు అడంగల్ ఉంటేనే బ్యాంక్‌లకు రండి.. లేదంటే పొండి అంటూ బ్యాంక్ అధికారులు రైతుల ముఖంపైనే చెప్పేస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు.

అడంగల్ ఉంటేనే లోను రెన్యువల్



మా అమ్మ పేరు మీద ఉన్న పాస్ పుస్తకంలో సర్వే నంబర్‌తో 1-బీ వస్తుంది. అయితే 1-బీలో ఉన్న సర్వే నంబర్‌తో అడంగల్ రావడం లేదు. లోన్ రెన్యువల్ కోసం బ్యాంక్‌కి వెళ్తే అడంగల్ తప్పని సరిగా తీసుకురావాలని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. బ్యాంక్ అధికారులు తీరుతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అడంగల్ కోసం మీ సేవా కేంద్రాలు, మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ మండుటెండలో తిరగాల్సి వస్తుంది.
– బి.భాస్కరరావు, రైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

ఇబ్బందులు పెట్టడం సరికాదు



పంటల సాగుకు రైతులకు ఎలాంటి హామీ లేకుండా రూ. రెండు లక్షల వరకు రుణాలు అందించాలని ఆర్‌బీఐ చెబుతుంది. అయితే రైతుల పేరున భూములు ఉన్నప్పటికీ వారు రుణ ఇబ్బందులు పడుతుండటం సరికాదు. లోన్ రెన్యువల్ కోసం బ్యాంక్ అధికారులు 1-బీతో పాటు అడంగల్ తప్పని సరి చేయడంతో మరింత ఆర్థిక భారం పడుతుంది. చిన్న, సన్నకారి రైతులు పేరిట ఎకరం పొలానికి ఎక్కువ సర్వే నంబర్లు ఉండటంతో వారు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకూ రైతులపై భారం పడుతుంది. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– కె.మోహన్‌రావు, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి, శ్రీకాకుళం

రైతులపై ఆర్థిక భారం



పంట రుణాలు రెన్యువల్ చేయడానికి అడంగల్ తప్పని సరి కావడంతో నాకు రూ.1250 ఖర్చు అయింది. గతంలో కేవలం 1-బీ కోసం రూ. 50 ఖర్చు అయ్యేది. నాడు ఇలాంటి పరిస్థితి లేదు. కేవలం 1-బీ, పాస్ పుస్తకం పట్టుకొని బ్యాంక్‌కు వెళ్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా రుణాలను పొందాం. అలాగే రుణాన్ని రెన్యూవల్ చేసుకున్నాం. ప్రస్తుతం లోన్ రెన్యువల్ కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.
– టి.అప్పలస్వామి, రైతు, వజ్రపుకొత్తూరు

ఉపాధి లక్ష్యాలు పూర్తి చేయాలి



ఇద్దివానిపాలెం తీరంలోని వరదగట్టును పరిశీలిస్తున్న అధికారులు

కవిటి: ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధించాలని క్లస్టర్ ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి అన్నారు. లక్ష్యాలు సాధించలేని క్షేత్ర, సాంకేతిక సహాయకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కవిటి మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఏపీవో టి.మోహనరావుతో కలిసి సాంకేతిక సహాయకులపై పనితీరుపై మంగళవారం సమీక్షించారు. సోమవారం నాటికి మండలంలోని వివిధ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో 4,268 మంది వేతనదారులకు పని కల్పించినట్టు తెలిపారు. అధికారుల నిర్దేశిత లక్ష్యం ప్రకారం ప్రస్తుత వారాంతానికల్లా కనీసం ఎనిమిది వేల మంది వేతనదారులకు పని కల్పించాలని ఏపీడీ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తీరప్రాంత గ్రామాల్లో ఏవిధమైన పనులు చేపట్టడానికి అవకాశం ఉందన్న విషయాన్ని తెలుసుకోవడానికి ఇద్దివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఏపీవో టి.మోహనరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నెయ్యిల నీలాంబర్, టీఏలు శ్యాంసుందరరావు, దివ్య, నారాయణ ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మందస: ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సదస్సు మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, వీఆర్ఏ సంఘం నాయకుడు పి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు ఎం.ధర్మారావు మాట్లాడుతూ.. లేబర్ కోడ్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలనే డిమాండ్‌తో సమ్మెకు పిలుపునిచ్చినట్టు పేర్కొన్నారు. సమావేశంలో సంఘ నాయకులు క్రిష్ణారావు, జగ్గారావు, తాతయ్య, రమేష్, మోహనరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరం వద్ద సమ్మె కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, డి.శ్రీనివాస్, పోతనపల్లి అప్పారావు, మద్దిల రాజారావు, దాలమ్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు అండ పోక్సో చట్టం

కవిటి: మహిళలకు పోక్సో చట్టం రక్షణ కవచంగా నిలుస్తోందని ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో పురాణం నాగరాణి అన్నారు. కవిటి, ఇద్దివానిపాలెం, బిగొనపపుట్టుగ తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి కిశోరీబాలికల వికాసంలో భాగంగా 15 నుంచి 18 ఏళ్ల వయసు గల బాలికలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, మండల మహిళా సమాఖ్య ప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్టు పీవో తెలిపారు.



కవిటిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న పీవో నాగరాణి

సూపర్‌వైజర్లు పి.పల్లవి, జి.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

కవిటి: స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపట్టామని ఎంఈవో ధనంజయమజ్జి తెలిపారు. ఈ మేరకు కవిటి ఎంఈవో కార్యాలయంలో ఐఈఆర్‌టీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 0 నుంచి 18 సంవత్సరాల్లోపు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం మే 13 నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల సమాచారం తెలిసినవారు 82473 93043, 93911 64018 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సైనికుల క్షేమం కోసం ప్రత్యేక పూజలు



అలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న గ్రామస్తులు

పలాస: దేశ సైనికుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ మోదుగులపుట్టి గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలుకొట్టి మొక్కులు చెల్లించారు. తమ గ్రామంలో కూడా ఒక హవల్దార్ సైనికునిగా దేశసేవలందించి హతాన్మరణం పొందారని, ఇటీవల యుద్ధంలో మృతి చెందిన వీరులకు, ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకుశాంతి కలగాలని పూజలు చేశారు. గ్రామ పెద్దలు అవుగాన దశరథ, రవికుమార్, పార్వతీశం, అప్పలస్వామి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కాశీబుగ్గ: తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తండ్రి మల్లా సుదర్శనరావు ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు మంగళవారం తెలిపారు. పిల్లలకు డ్రైఫ్రూట్స్ కొనేందుకు వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

మేజర్ పంచాయతీలో.. క్షీణించిన పారిశుద్ధ్యం!



చేరీవీధి జంక్షన్ వద్ద పేరుకుపోయిన చెత్త



శివాలయంవీధి జంక్షన్ వద్ద ఇలా..

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేసింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసినా చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో 195కు పైగా వీధులు ఉన్నాయి. అయితే పారిశుద్ధ్య నిర్వాహణ విషయంలో మాత్రం అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధాన రోడ్లు డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. సమీపంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నప్పటికీ దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్లపైనే విచ్చలవిడిగా చెత్త నిల్వలు కనిపిస్తున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి పారిశుద్ధ్యం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

నీరు ఇలా.. రాకపోకలు ఎలా..



టెక్కలి మండలం బూరగాం గ్రామం దాటిన తరువాత రామేశ్వరం గ్రామం సమీపంలో రైల్వే అండర్ పాసేజ్ వంతెనలో వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్నటువంటి రైల్వే గేటు మార్గం ఉండడంతో ఆయా గేటును దాటుకుని రాకపోకలు సాగించేవారు. ఇప్పుడు గేటును మూసి వేసి అండర్ పాసేజ్‌ను నిర్మాణం చేశారు. అయితే ఈ వంతెనలో నీరు చేరడంతో ప్రస్తుతం రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు రాకపోకలు విషయంలో మరింత అవస్థలు పడుతున్నారు. – టెక్కలి

విశ్రాంతి మండపం ప్రారంభం



కంచిలి మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి ఎస్.బొనమాళి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ. 4 లక్షల వ్యయంతో స్థానిక సర్పంచ్ గణప సింహాచలం ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తిచేసుకున్న స్వర్గధామ మండపాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, మద్దు అభియాదవ్, జలసూత్ర కామేష్, వంకల జయరాం పాల్గొన్నారు.
– కంచిలి

కుదిరిన జీడి కార్మికుల వేతన ఒప్పందం



పీసీఎంఏ అధ్యక్షుడు శ్రీనివాస్ నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న కార్మిక సంఘ అధ్యక్షులు క్రిష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస క్యాజు మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్, క్యాజు లేబర్ అండ్ రైస్ మిల్లర్ల యూనియన్ మధ్య జరిగిన వేతన ఒప్పందం కొలిక్కి వచ్చింది. పీసీఎంఏ కార్యాలయంలో అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో మంగళవారం చర్చలు జరిగాయి. జీడి పరిశ్రమల యాజమాన్యం, కార్మిక సంఘం వారికి 2025-27 సంవత్సరాలకు వేతన ఒప్పందంపై ఇరు సంఘాలు పరస్పర అంగీకారం తెలుపుకున్నారు. బస్తా జీడి పిక్కలు బాయిలింగ్ వేసే వారికి 68.90 పైసలు నుంచి రూ.71 రూపాయలకు పెంచారు. జీడి పిక్కలు కటింగ్ చేసే వారికి కేజీకి రూ.33.60 పైసలు నుంచి 34 రూపాయలు, ఫీలింగ్ చేసే వారికి కేజీ ఒక్కింటికి రూ.12.35 నుంచి రూ.12.5, జీడి పిక్కలు బస్తా ఎండబోతకు రూ.37 నుంచి 43 రూపాయలు ఇవ్వడానికి ఇప్పందం కుదిరింది. మిగతా అన్ని రకాల పనులకు 2023-25 సంవత్సరంలో ఇచ్చినటువంటి వేతనం కంటే బేసి రేటుకి 10% పెంచుటకు ఇరు సంఘాల పెద్దలు అంగీకరించారు. ఇందుకుగాను సహకరించిన కార్మిక సంఘ కార్యవర్గానికి, స్థానిక శాసన సభ్యురాలు గౌతు శిరీషకు ఇరు సంఘాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా సోమలాయి ఆలయ ప్రతిష్ట



కవిటి: పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు



సోంపేట: కర్తలిపాలెంలో చైర్‌పర్సన్ విజయను సన్మానిస్తున్న ఉత్సవకమిటీ ప్రతినిధులు

కవిటి: చిన్నబడ్డాయిపుట్టుగ గ్రామదేవత సోమలాయి అమ్మవారు, పారిమాత నూతన ఆలయాల ప్రతిష్ట వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవార్లను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

గ్రామదేవత ఉత్సవాలు..

సోంపేట: బేసిరామచంద్రాపురం, కర్తలిపాలెం గ్రామాల్లో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పాల్గొన్నారు. బేసి రామచంద్రాపురం గ్రామదేవత బేసి పోలమ్మ, కర్తలిపాలెం గ్రామదేవత భైరవి మాతలను దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు చైర్‌పర్సన్ విజయను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. బేసి రామచంద్రాపురం, కర్తలిపాలెం సర్పంచ్‌లు బుద్దాన రోహిణి, పొందూరు గున్నయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేసిరామచంద్రాపురం గ్రామదేవత బేసి పోలమ్మను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయనతో పాటు పలువురుపార్టీనాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువు వినియోగం పెంచాలి

- ఉద్యాన పరిశోధనాస్థానం శాస్త్రవేత్త రాజశేఖర్



బల్లిపుట్టుగలో తెల్లదోమ తీవ్రతను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

కవిటి: కొబ్బరి సాగు చేస్తున్న రైతులు తమ తోటల్లో విధిగా పచ్చిరొట్ట వినియోగం పెంచాలని పెద్దపేట ఉద్యాన పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బల్లిపుట్టుగా, బొరివంక, కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం గ్రామాలలో మంగళవారం పర్యటించి కొబ్బరి తోటలలో తెగుళ్లు, చీడపీడలు గుర్తించారు. కొబ్బరిలో వచ్చే సర్పిలకర తెల్లదోమ, గానొడర్మ, ఎర్ర ముక్కు, నల్లముట్టి పురుగుల నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వీటిని అరికట్టడంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులను విరివిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు జగదీష్, సంతోష్‌రెడ్డి, ఎంపీఈవో లలిత, రైతులు బార్ల చిన్నబాబు, వజ్జ గోపి, పూడి సందీప్, బార్ల బాబూరావు, పిన్నింటి కాశేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సక్రమంగా సుఖీభవ జాబితా

సోంపేట: అన్నదాత సుఖీభవ జాబితాలు సక్రమంగా తయారు చేయాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సిబ్బందికి సూచించారు. పలాసపురం గ్రామంలో వ్యవసాయ సిబ్బంది తయారు చేస్తున్న జాబితాను మంగళవారం పరిశీలించి, సలహాలు సూచనలు అందజేశారు. 19,367 మంది రైతుల రికార్డులు పరిశీలించవలసి ఉందన్నారు. ప్రస్తుతానికి 20 శాతం పూర్తయినట్టు పేర్కొన్నారు.

నేడు ఎంబిజీ లేఅవుట్‌లో స్థలాలకు లాటరీ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన ఎంబిజీ బొడ్డపాడు లేఅవుట్-02లో స్థలాల కోసం బుధవారం లాటరీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్టు సుడా అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల వేదికగా ఉదయం 240 గజాల స్థలాల కోసం, మధ్యాహ్నం 200, 100 గజాల స్థలాలకు లాటరీ తీయనున్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరగాంధీ జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి సీఐ విజయ్‌కుమార్ సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక వాహనదారులకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు.

18న యూవీవీ వార్షికోత్సవం

కాశీబుగ్గ: నీలావతి గ్రామంలో ఈనెల 18న ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక 23వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వేదిక సభ్యు లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వానిత గ్రూప్ టాలెంట్ టెస్టును ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించి విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ!

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో టీడీపీ వార్డు కమిటీల నియామకం విషయంలో నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కమిటీల నియామకం కోసం వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం సమావేశం అయ్యారు. కమిటీల నియామకం కోసం వార్డుల వారీగా పేర్లను ఎంపిక చేశారు. 12వ వార్డుకు వచ్చేసరికి ఆశీర్వులు, కొండా శంకర్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తాము ప్రతిపాదించే పేర్లనే కమిటీలో ఉంచాలని ఇరువురు పట్టుపట్టడంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో మిగిలిన నాయకులు జోక్యం చేసుకొని సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది.

పశువ్యాధులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన

మందస: అల్లిమెర్యాధికారులు పాడిరైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం క్వాలిటీ ఎనలిటికల్ లేబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.రమాదేవి, డాక్టర్ ఆర్.కిషోర్ బృందం ఆధ్వర్యంలో పోస్ట్ వ్యాక్సినేషన్ సీరం నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.